సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శనివారం
15-03-2025
పేజీలు: 02

## హోలీ వేడుకల్లో హీరోయిన్స్










## తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు



తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మూడో రోజు కూడా హాట్ హాట్‌గా సాగే అవకాశం కనిపిస్తోంది. సభ ప్రారంభం కాగానే మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అంశం చర్చకు వచ్చింది. జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ అంశం పునఃసమీక్షించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కోరారు. ఇక ఇవాళ గవర్నర్ ప్రసంగ ధన్యవాద తీర్మానంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. గత సెషన్‌లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టగా.. ఆ చర్చ తీవ్ర దుమారానికి కారణమైంది. స్పీకర్ గడ్డం ప్రసాద్-మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి మధ్య జరిగిన సంభాషణ.. సభలో అలజడి రేపింది. స్పీకర్.. అందునా దళితుడ్ని జగదీష్ అవమానించారని కాంగ్రెస్ సభ్యులు, జగదీష్ మాట్లాడిన దాంట్లో తప్పేం లేదని బీఆర్ఎస్ వాదించుకున్నాయి. దీంతో సభ వాయిదా పడగా.. ఆపై పరిణామాలు శరవేగంగా ముందుకు కదిలి జగదీష్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది.

## ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్



ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్.. ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈ యేటి ఐపీఎల్‌లో ఆ జట్టు సారథిగా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. కెప్టెన్సీ నుంచి రిషబ్ పంత్ తప్పుకోవడంతో.. అతని స్థానంలో అక్షర్ పటేల్ ను ప్రకటించారు. 31 ఏళ్ల అక్షర్ 2019 నుంచి ఢిల్లీ జట్టుకు ఆడుతున్నాడు. అతన్ని 16.50 కోట్లకు ఆ జట్టు రిటేన్ చేసుకున్నది. గతంలో గుజరాత్ జట్టుకు కెప్టెన్‌గా చేసిన అనుభవం అక్షర్‌కు ఉంది. ఈ ఏడాది ఆరంభంలో భారత టీ20 జట్టుకు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు కూడా నిర్వర్తించాడు. గత సీజన్‌లో అతను ఢిల్లీ జట్టు తరఫున 235 రన్స్ స్కోర్ చేశాడు. 11 వికెట్లను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు సారథిగా వ్యవహరించడం గౌరవంగా భావిస్తున్నట్లు అక్షర్ తెలిపాడు. ఓ క్రికెటర్‌గా ఎదిగానని, కెప్టెన్సీ చేపట్టేందుకు విశ్వాసంతో రెడీగా ఉన్నట్లు తెలిపాడు. వాస్తవానికి ఢిల్లీ జట్టుకు కేఎల్ రాహుల్ కెప్టెన్సీ చేపడుతాడన్న ఊహాగానాలు వినిపించాయి.



### వలసలపై కఠిన చర్యలు

## 41 దేశాలపై ట్రావెల్ బ్యాన్

ఉద్యోగాల కోతలు, దేశాలపై సుంకాలతో దూకుడు పాలన సాగిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా మరో కీలక నిర్ణయానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. పదుల కొద్దీ దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించే అంశాన్ని ట్రంప్ సర్కారు పరిశీలిస్తున్నారట. 41 దేశాల పౌరులు అగ్రరాజ్యంలోకి రాకుండా త్వరలో ప్రయాణ ఆంక్షలు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇందుకు సంబంధించి ఒక ఇంటర్నల్ మెమో బయటికొచ్చింది. అందులో మొత్తం ఈ 41 దేశాలను మూడు గ్రూప్‌లుగా విభజించినట్లు సమాచారం. పది దేశాలతో ఉన్న మొదటి గ్రూప్‌లో అఫ్గానిస్థాన్, ఇరాన్, సిరియా, క్యూబా, ఉత్తరకొరియా వంటివి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాల పౌరులకు వీసాల జారీ పూర్తిగా నిలిపివేయనున్నారట. ఇక, రెండో గ్రూప్‌లో ఇరిట్రియా, హైతీ, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్ దేశాలున్నాయి. వీటిపై పాక్షిక ఆంక్షలు అమలుచేయనున్నారని ఆ మెమోలో పేర్కొన్నారు.



## దారుణం.. చదువులో వెనకబడ్డారని ఇద్దరు పిల్లలను చంపి తండ్రి సూసైడ్

పిల్లల కాళ్లూ చేతులు కట్టేసి తలలు బకెట్లలో ముంచేసి కన్న బిడ్డలను కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కడతేర్చాడు. ఈ పోటీ ప్రపంచంలో రాణించలేరని వారిని బలిగొన్నాడు. అతడూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హోలీ పండగనాడు కాకినాడలోని సుబ్బారావునగర్‌లో ఈ దారుణం చోటుచేసుకున్నది. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన వానపల్లి చంద్రకిశోర్.. కాకానాడ జిల్లా వాకలపూడిలోని ఓఎన్‌జీసీలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. అతనికి భార్య తనూజ, జోషిల్ (7), నిఖిల్ (6) ఉన్నారు. ఉద్యోగ రీత్యా తోటసుబ్బారావు నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. జోషిల్ ఒకటో తరగతి చదువుతుండగా, నిఖిల్ యూకేజీ చదువుతున్నాడు. హోలీ సందర్భంగా భార్యా, పిల్లలను తీసుకుని తమ ఆఫీసులో వేడుకలకు వెళ్లాడు. భార్యను అక్కడే ఉండమని, పిల్లలకు టైలర్ వద్ద కొలతలు తీయించి పది నిమిషాల్లో వస్తానని చెప్పి ఇంటికి వచ్చాడు. పిల్లలిద్దరి కాళ్లూ చేతులు కట్టి.. బాత్రూం బకెట్లలో నీటిలో వారిని ముంచి, ఊపిరాడకుండా చేసి చంపేశాడు. అనంతరం తానూ బెడ్రూమ్‌లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అయితే ఎంతకూ భర్త రాకపోవడంతో.. ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో తనూజ తోటి ఉద్యోగులతో కలిసి ఇంటికి వచ్చింది. కిటికీలోంచి చూడగా.. కిశోర్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నాడు. దీంతో తలుపులు బద్దలుకొట్టి ఇంట్లోకి వెళ్లి చూస్తే, పిల్లలిద్దరూ బకెట్‌లో తలలు మునిగిపోయి విగతజీవులుగా ఉన్నారు. దీంతో ఆమె ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో దొరికిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు.




## ముంబై X ఢిల్లీ..

# నేడు డబ్ల్యూపీఎల్-3 ఫైనల్స్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 3వ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. గత నెలలో మొదలైన ఈ సీజన్‌లో శనివారం టైటిల్ పోరు జరగనుంది. ఫైనల్‌లో మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ మూడు సీజన్లలోనూ ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి సీజన్ ఫైనల్‌లో ఇదే ముంబై చేతిలో ఓడిన ఢిల్లీ.. రెండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జోరు ముందు నిలవలేక చతికిలపడింది. ముచ్చటగా మూడోసారి ఫైనల్ చేరిన మెగ్ లానింగ్ సేన.. మూడో ప్రయత్నంలో అయినా టైటిల్ కలను నెరవేర్చుకుంటుందా? లేక సొంత మైదానంలో ముంబై మళ్లీ కప్పును ఎగరేసుకుపోతుందా? అన్నది నేడు తేలనుంది. ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియంలో ఈ మ్యాచ్ శనివారం రాత్రి 8 గంటలకు మొదలవనుంది. బలాబలాల పరంగా చూస్తే ఇరు జట్లూ పటిష్టంగానే ఉన్నాయి. ముంబై తరఫున ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న నటాలీ సీవర్ బ్రంట్ (493 పరుగులు, 9 వికెట్లు) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతోంది. సీవర్‌తో పాటు మరో ఆల్‌రౌండర్ హేలి మాథ్యూస్ (304 రన్స్, 17 వికెట్లు) ముంబై విజయాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఫైనల్‌లోనూ ఈ ఇద్దరూ ఇదే జోరును కొనసాగించాలని ముంబై ఆశిస్తోంది. సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ (236 రన్స్) బ్యాట్‌తో పాటు తన వ్యూహాలతో మైదానంలో ప్రత్యర్థి జట్లను తిప్పలు పెడుతోంది. ఇక స్పిన్నర్ అమేలియా కెర్ (16 వికెట్లు) మరోసారి బ్రబౌర్న్‌లో సత్తా చాటితే ఢిల్లీకి కష్టాలు తప్పవు. ఢిల్లీ కూడా తక్కువేమీ తినలేదు. ఆరంభంలోనే తనదైన దూకుడుతో ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోసే షెఫాలీ వర్మ (300 పరుగులు) మంచి టచ్‌లో ఉండగా కెప్టెన్ మెగ్ లానింగ్ (263 రన్స్), నిలకడగా రాణిస్తోంది. ఈ ఓపెనింగ్ ద్వయాన్ని అడ్డుకోకుంటే ముంబై భారీ మూల్యం చెల్లించక తప్పదు. మిడిలార్డర్‌లో జెమీమా, అన్నాబెల్, జొనాసెన్‌తో పాటు పేస్ ఆల్‌రౌండర్ మరిజన్నె కాప్ వంటి హిట్టర్లు ఢిల్లీ సొంతం. ఢిల్లీ బౌలింగ్ విభాగం కాస్త బలహీనంగా కనిపిస్తున్నా స్పిన్నర్లు ఏ మేరకు రాణిస్తారనే దానిపై క్యాపిటల్స్ విజయం ఆధారపడి ఉంది. బ్యాటింగ్‌తో పాటు స్పిన్‌కు అనుకూలిస్తున్న బ్రబౌర్న్ పిచ్‌పై ఇరు జట్ల మధ్య రసవత్తర పోరు జరగడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఆర్. కృష్ణయ్యకు వార్నింగ్

సెంట్రల్ యూనివర్సిటీ భూములను విక్రయిస్తే అడ్డుకుంటామని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ప్రభుత్వం నిర్వహించే వేలంలో ఎవరూ పాల్గొనవద్దని, ఆ భూములను కొనుగోలు చేస్తే అందులో అడుగుపెట్టనీయబోమన్నారు. భూముల విక్రయంపై ప్రధాని మోదీకి ఫిర్యాదు చేస్తామన్నారు. భూముల విక్రయాలను ఆపకపోతే ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాచిగూడలోని ఓ హోటల్‌లో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. గచ్చిబౌలిలో సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని 400 ఎకరాల భూమిని అమ్మడానికి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, ఓయూ జేఏసీ చైర్మన్ రాజు, బీసీ సంఘాల నేతలు కోల జనార్ధన్, నందగోపాల్, ఉదయ్, చెరుకు మణికంఠ పాల్గొన్నారు.



# ఆఫీసర్ ఆన్ డ్యూటీ రివ్యూ



కుంచకో బోబన్ హీరోగా నటించిన క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ'. ప్రియమణి హీరోయిన్ గా నటించింది. మలయాళంలో ఈ సినిమా ఫిబ్రవరి 20న విడుదల చేశారు. తెలుగులో రిలీజ్ అయ్యింది. మరి ప్రేక్షకులను ఈ సినిమా ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం! హరి శంకర్ (కుంచకో బోబన్) సీఐ. సస్పెన్షన్ తర్వాత డ్యూటీలో చేరతాడు. అతని ప్రవర్తనకు ఆ స్టేషన్ సిబ్బంది కూడా భయపడుతూ ఉంటారు. దీనికి తోడు హరి శంకర్ డ్యూటీలో జాయిన్ తొలిరోజు గోల్డ్ చైన్ కేసు వస్తుంది. ఆ కేసు విచారణలో భాగంగా ఓ అమ్మాయిని ఇన్వెస్టిగేషన్ కోసం స్టేషన్‌కు రమ్మని చెబితే_ _ _ ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమె ఆత్మహత్యకు, బెంగళూరులోని ఓ పోలీస్ ఆత్మహత్యకు, కేసుకు సంబంధం ఉందని హరి శంకర్ కి డౌట్ వస్తోంది. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో తన కుమార్తె మరణానికి హరి శంకర్ కారణం అని అమ్మాయి తండ్రి ఆరోపణలు చేస్తాడు. అసలు ఇంతకీ ఆ అమ్మాయి ఎందుకు చనిపోయింది ?, హరి శంకర్ కూతురు చావుకి కారణం ఏమిటి ?, అలాగే విచారణలో హరి శంకర్ ఏం చేశాడు? బెంగళూరు వెళ్లిన తర్వాత అతనిపై హత్యాయత్నం చేసిన గ్యాంగ్ సభ్యులు ఎవరు ? వాళ్లకు, ఈ కేసుకు సంబంధం ఏమిటి ? హరి శంకర్ నుంచి భార్య గీత (ప్రియమణి) విడాకులు ఎందుకు కోరింది ? డ్రగ్స్, న్యూడ్ వీడియోలు తీస్తూ అమ్మాయిలను రేప్ చేయడం ఏమిటి ? చివరకు ఈ కేసును హరి శంకర్ ఎలా డీల్ చేశాడు ?, ఆ కిల్లర్స్ ను ఎలా అంతం చేశాడు ? అనేది మిగిలిన కథ. ఈ 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ' ప్రారంభం నుంచి దర్శకుడు జీతూ అష్రఫ్ ఒక మూడ్‌లోకి తీసుకువెళ్ళారు. సినిమాలో పాత్రలు కూడా బలంగా ఉన్నాయి. ముఖ్యంగా హీరో పాత్రకు ఒక సమస్య ఉందని ముందు నుంచి చెబుతూ వచ్చి_ _ _ ఆ సమస్య ఏమిటో రివీల్ చేస్తూ వెళ్లిన విధానం ఆకట్టుకుంది. చాలా సీన్లలో టెన్షన్ ను బిల్డ్ చేస్తూ దర్శకుడు సీన్స్ ను ఎలివేట్ చేయడం చాలా బాగుంది. నటీనటుల నటన విషయానికి వస్తే.. కుంచకో బోబన్ తన పరిపక్వతమైన నటనతో ఈ చిత్రంలోనే ఉత్తమమైన నటనను కనబర్చారు. ముఖ్యంగా క్లిష్టమైన కొన్ని యాక్షన్ అండ్ ఎమోషనల్ సన్నివేశాల్లో ఆయన తన మార్క్ యాక్షన్ తో, నటనతో సినిమాకే హైలెట్ గా నిలిచారు. అలాగే మరో ప్రధాన పాత్రలో నటించిన ప్రియమణి కూడా చాలా బాగా నటించింది. భార్య పాత్రలో ఆమె నిజంగా ఒదిగిపోయింది.

## బోల్డ్ అవతార్‌లో
# కేతికా శర్మ

ఈ నటి ఇప్పటివరకు ప్రేక్షకులకు చాలా తక్కువ చిత్రాలను ఇచ్చింది. వారిలో, నటి కేతికా శర్మ రొమాంటిక్స్ చిత్రంలో చాలా బోల్డ్ అవతారాన్ని చూపించింది. ఈ చిత్రం హిట్ కావడమే కాకుండా, నటి బోల్డ్ అవతారం అభిమానుల హృదయాలను కూడా గెలుచుకుంది. నటి కేతికా శర్మ కూడా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఆమె తరచుగా తన బోల్డ్ చిత్రాలతో వినాశనం సృష్టిస్తుంది. ఇటీవల, నటి కేతికా శర్మ తన బోల్డ్ చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడం ద్వారా మరోసారి తన అభిమానులను వెర్రివాళ్లను చేసింది. నటి కేతికా శర్మ ఇటీవల సోషల్ మీడియాలో మినీ రెడ్ డ్రెస్ ధరించి తన అభిమానులలో సంచలనం సృష్టించింది. ఈ చిత్రాలలో, నటి బోల్డ్ అవతార్‌లో కనిపిస్తుంది. ఈ చిత్రాలలో నటి కేతికా శర్మ చాలా సెక్సీగా కనిపిస్తోంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో కనిపించిన వెంటనే వైరల్ అయ్యాయి. నటి కేతికా శర్మ యొక్క ఈ బోల్డ్ చిత్రాలు సోషల్ మీడియాలో విధ్వంసం సృష్టిస్తున్నాయి. నటి యొక్క ఈ చిత్రాలు ఇంటర్నెట్‌లో కనిపించిన వెంటనే వైరల్ అయ్యాయి.






# దేవేంద్ర, శిల్పలకు హైకోర్టులో చుక్కెదురు


జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నమోదు చేసిన కేసులో చైతన్య మహిళా సంఘానికి చెందిన డొంగరి దేవేంద్ర, చుక్కా శిల్పలకు బెయిల్ నిరాకరిస్తూ విశాఖపట్నం మూడో అదనపు జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. నేర తీవ్రత దృష్ట్యా వీరిద్దరికీ బెయిల్ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. విశాఖ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ వారు వేసిన అప్పీళ్లను కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి, జస్టిస్ జస్టిస్ టి.చంద్ర ధనశేఖర్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. చైతన్య మహిళా సంఘానికి చెందిన డొంగరి దేవేంద్ర, చుక్కా శిల్ప తన కుమార్తె రాధకు మావోయిస్టు భావజాలాన్ని నూరిపోసి బలవంతంగా మావోయిస్టు పార్టీలో చేర్పించారని తల్లి పల్లెపాటి పోచమ్మ 2021 డిసెంబరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా ఉమ్మడి విశాఖ జిల్లా పెద్దబయలు పోలీసులు వారిద్దరిపై ఐపీసీ, ఉపా చట్టం కింద 2022 జనవరిలో కేసు నమోదు చేశారు. నేర తీవ్రత దృష్ట్యా ఈ కేసు దర్యాప్తును స్వీకరించిన ఎన్ఐఏ విచారణ పూర్తి చేసి సంబంధిత కోర్టులో చార్జిషీటుదాఖలు చేసింది. దేవేంద్ర, శిల్ప బెయిల్ కోసం పిటిషన్లు వేయగా.. విశాఖపట్నం మూడో అదనపు జిల్లా కోర్టు తిరస్కరించింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ వారు హైకోర్టులో అప్పీల్ వేశారు. వారి తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. 'తన కుమార్తెను బలవంతంగా తీసుకెళ్లి 2017లో మావోయిస్టు పార్టీలో చేర్పించారని రాధ తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు.

# సీడాప్ తొలిగింపు ఎందుకు?

నైపుణ్యాభివృద్ధి శాఖలో భాగంగా ఉన్న సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ(సీడాప్) గత కొన్నేళ్లుగా యువతకు ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఉపాధి అవకాశం కల్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పథకం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్య యోజన(డీడీయూ-జీకేవై) ద్వారా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ శిక్షణ కార్యక్రమాల అమలుకు 2016, 2019లో ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ(పీఐఏ)లను ఎంప్యానెల్ చేశారు. మొత్తం 41 పీఐఏలు రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అందుకుగాను ఒక్కో వ్యక్తికి సగటున రూ.50వేల చొప్పున పీఐఏలకు వెళ్తాయి. యువతకు శిక్షణతో పాటు భోజనం, రవాణా ఖర్చులు, ఉపాధి కల్పన, ఉద్యోగం వచ్చాక మొదటి రెండు నెలల సహకారం అందించడం పీఐఏల బాధ్యత. వివిధ చేతి వృత్తులు, ఇతర కోర్సులపై 3, 4, 6 నెలల పాటు వేర్వేరు శిక్షణ కార్యక్రమాలను పీఐఏలు నిర్వహిస్తాయి. అయితే కొందరికి మేలు చేసే ఉద్దేశంతో అకస్మాత్తుగా 13 పీఐఏలను ఇటీవల సీడాప్ తొలగించింది. ప్రాజెక్టు అప్రూవల్ కమిటీ(పీఏసీ)లో పెట్టి తొలగించినట్లు వారికి సమాచారం ఇచ్చింది.

# పవన్ కళ్యాణ్‌కి కౌంటర్ ఇచ్చిన ప్రకాశ్ రాజ్


జనసేనాని పవన్ కళ్యాణ్ చిత్రాడలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పలు విషయాల గురించి మాట్లాడారు. ఈ క్రమంలోనే తమిళనాట హిందీని తమపై రుద్దుతున్నారని హడావిడి చేస్తున్న కొందరి గురించి కామెంట్స్ చేశారు. అంటే పరోక్షంగా తమిళనాడు అంశాన్ని ప్రస్తావించారు. అన్ని దేశ భాషలే కదా. తమిళనాడులో హిందీ వద్దని అనడం ఎంత వరకు కరెక్ట్. మరి తమిళ సినిమాలను హిందీలోకి అనువదించకండి.. హిందీవాళ్ల డబ్బులు కావాలి.. కానీ హిందీ భాష వద్దంటే ఎలా ? మనం భాషలను ద్వేషించాల్సిన అవసరం లేదు. దేశానికి తమిళం సహా బహుళ భాషలు కావాలి.. బహుభాషలే దేశానికి మంచిది అంటూ పవన్ కళ్యాణ్ కామెంట్ చేశారు. అంతేకాదు తమిళనాడులో సంస్కృతాన్ని తిడుతున్నారు. దక్షిణాదిపై హిందీని రుద్దుతున్నారంటూ మాట్లాడుతున్నారు. ఏ రాష్ట్రంలో అయిన ముస్లింలు అరబిక్‌లోనే ప్రార్థిస్తారు. కానీ ఎన్నడూ ఆ భాష తమకొద్దని అనలేదు. హిందువులు మాత్రం దేవాలయాలలో సంస్కృత మంత్రాలు చదవొద్దని చెబుతుంటారు. ముస్లింలని చూసి హిందువులు చాలా నేర్చుకోవాలి. రూపాయి సింబల్ మార్చేసి తమిళ భాషలో పెట్టుకోవటం ఏంటి ? వివేకం, ఆలోచన ఉండొద్దా అన్నారు పవన్ కళ్యాణ్. ఉత్తరాది వాళ్లు తెల్లగా ఉంటారు.





## 30 కోట్లు సంపాదించిన బోట్‌మ్యాన్ కుటుంబానికి
# 12.8 కోట్ల ఐటీ నోటీసులు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఇటీవల జరిగిన మహాకుంభ్‌లో బోటులు నడిపే ఓ కుటుంబం 30 కోట్లు సంపాదించినట్లు ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీలో వెల్లడించిన విషయం తెలిసిందే. బోట్‌మ్యాన్ పింటూ మహ్రా కుటుంబం త్రివేణి సంగమం వద్ద కుంభమేళా సమయంలో 45 రోజుల పాటు సుమారు 130 బోట్లు నడిపారు. అరైల్ గ్రామానికి చెందిన ఆ ఫ్యామిలీ.. 45 రోజుల్లోనే 30 కోట్లు ఆర్జించింది. అయితే ఆ కుటుంబానికి ఆదాయపన్ను శాఖ ఇప్పుడు నోటీసులు జారీ చేసింది. ఇన్‌కం ట్యాక్స్ చట్టం 1961 ప్రకారం రూ.12.8 కోట్లు పన్ను చెల్లించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. బోట్‌మ్యాన్ పింటూ మహ్రా కుటుంబం ఆదాయపన్ను శాఖ ఇచ్చిన నోటీసుతో షాక్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ నోటీసులపై ఫైనాన్షియల్ ప్లానర్, సెబీ రీసర్చ్ అనలిస్ట్ ఏకే మంధన్ స్పందించారు. బోట్‌మ్యాన్ పింటూ డబ్బు సంపాదించినా.. ఆయనకు సుఖం లేకుండా పోయిందన్నారు. కుంభమేళాలో రద్దీ వల్ల ఒక్కొక్క రైడ్‌పై వెయ్యి వసూల్ చేసి.. ఆ డబ్బును సంపాదించారని, కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఆ ఫ్యామిలీకి షాక్ ఇచ్చినట్లు తన పోస్టులో పేర్కొన్నారు. ఆదాయ పన్ను శాఖ 1961 ఐటీచట్టంలోని సెక్షన్ 4, 68 కింద నోటీసు ఇచ్చిందని, రూ.12.8 కోట్లు ట్యాక్స్ రూపంలో చెల్లించాలని పేర్కొన్నదన్నారు. ట్యాక్స్ శ్లాబ్‌లు తెలియని వ్యక్తి .. ఇప్పుడు భారీ ట్యాక్స్ కట్టాల్సి వస్తోందన్నారు. డబ్బు సంపాదించినా.. అదో పీడకలగా మారిందన్నారు. ఒకప్పుడు నెలలో 15వేల సంపాదించేందుకు కష్టపడేవాళ్లని, ఇప్పుడు ఒకే ఏడాదిలో 12.8 కోట్ల పన్ను కట్టాల్సి వస్తుందన్నారు.




# దిల్ రూబా రివ్యూ

ఈ వారం థియేటర్స్ లోకి వచ్చిన చిత్రాల్లో హిట్ సినిమా "క" హీరో కిరణ్ అబ్బవరం హీరోగా రుక్షర్ ధిల్లాన్ హీరోయిన్ గా దర్శకుడు విశ్వ కరుణ్ తెరకెక్కించిన చిత్రం "దిల్ రూబా" కూడా ఒకటి. మరి ఈ చిత్రం ఎలా ఉందో రివ్యూలో చూద్దాం రండి. ఇక కథలోకి వస్తే.. తన మొదటి లవ్ మేఘన – మ్యాగీ (కాథీ డావిసన్) తో బ్రేకప్ అయ్యాక సిద్ధార్థ్ రెడ్డి – సిద్ధు (కిరణ్ అబ్బవరం) చాలా కుంగిపోతాడు. అలాగే తన జీవితంలో థాంక్యూ, సారి అనే రెండు పదాలు విషయంలో కూడా చాలా పర్టిక్యులర్ గా ఉంటాడు. ఇక తర్వాత ఆమె నుంచి బయటకి రావడానికి కడప నుంచి మంగుళూరు ఎంఐటి లో మెకానికల్ జాయిన్ అవుతాడు. ఇక అక్కడ పరిచయం అయ్యిన అంజలి (రుక్షర్ ధిల్లాన్) తో ప్రేమలో పడతాడు. అక్కడ నుంచి వీరి లవ్ స్టోరీ ఎలా కొనసాగింది? వీరి మధ్యలో ఎలాంటి చిక్కులు వచ్చాయి ఈ అందరిలో జోకర్(జాన్ విజయ్) ఎందుకు వచ్చాడు? చివరికి అంజలి, సిద్ధూలని కలిపేందుకు మేఘన ఏం చేస్తుంది? సిద్ధూ థాంక్యూ, సారి అనే సిద్ధాంతం ఎందుకు పెట్టుకున్నాడు అనేది తెలియాలి అంటే ఈ చిత్రాన్ని చూడాలి. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం గత సినిమాలతో పోలిస్తే మంచి స్టైలిష్ లుక్స్ లో కనిపించాడు అని చెప్పాలి. అలాగే తనపై కొన్ని సీన్స్ లో తన నటన డీసెంట్ గా ఉంది. అలాగే యాక్షన్ ఎపిసోడ్స్ లో తన మాస్ ప్రెజెన్స్ కూడా బాగుంది. ఇక తనతో పాటుగా రుక్షర్ కెమిస్ట్రీ కూడా కొన్ని సన్నివేశాల్లో బాగుంది. అలాగే యంగ్ నటి రుక్షర్ చిలిపి అమ్మాయిగా బానే చేసింది. ఇంకా వీరితో పాటుగా నెగిటివ్ రోల్ లో చేసిన జాన్ విజయ్ కూడా తన మార్క్ విలనిజాన్ని ప్రదర్శించారు. వీరితో పాటుగా కమెడియన్ సత్యపై కేవలం కొన్ని సీన్స్ ఓకే అనిపిస్తాయి. అలాగే సెకండాఫ్ లో కొన్ని ఒకటీ రెండు ట్విస్ట్ లు ఓకే అనిపిస్తాయి. ఈ చిత్రం యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్ కి ఎక్కువ బిగ్ స్క్రీన్ పై సినిమాకి తక్కువ అని చెప్పక తప్పదు. అసలు ఈ సినిమాలో ఆడియెన్స్ కి కనెక్ట్ అయ్యే అంశాలు కనేపించవు. చాలా డల్ మూమెంట్స్ తో సాగే కథనం ఎక్కడా కూడా ఆడియెన్ ని ఎగ్జైట్ చేయకుండా కొనసాగుతుంది. సినిమాలో ఏవేవో ప్రయత్నాలు కనిపిస్తాయి.. ఒక యాక్షన్ సీన్ వస్తుంది, పాటలు వస్తాయి. కానీ ఇంకా ఏదో సినిమాలో మిస్ అవుతున్న భావన ఆడియెన్ కి కలుగక మానదు. ఇలా సినిమాలో మెయిన్ సోల్ కి ఆడియెన్స్ కి పొంతన పెద్దగా కనిపించదు. చాలా సీన్స్ ఎన్నో లవ్ అండ్ బ్రేకప్ సినిమాల్లో చూసేసినవాటి లానే అవుట్ డేటెడ్ గా అనిపిస్తాయి. హీరోకి ఒక సిద్ధాంతం పెట్టారు కానీ దానిని ఇంకా బలంగా ఎస్టాబ్లిష్ చేసి ఉంటే బాగుండేది. ప్రాపర్ ఎమోషన్స్ కూడా సినిమాలో బాగా మిస్ అయ్యాయి. ఇక వీటితో పాటుగా సినిమాలో మరో హీరోయిన్ గా కనిపించిన కాథీ డావిసన్ తన రోల్ కి ఫిట్ కాలేదు. నిజానికి కిరణ్ అబ్బవరం కంటే ఆమె ఎక్కువ ఏజ్ లా కనిపిస్తుంది. పైగా తన నటన కూడా ఎక్కడా నాచురల్ గా కనిపించదు. వినిపించే డైలాగ్ కి ఆమె పలికించే పెదాల కదలికకు అసలు పొంతనే ఉండదు. అలాగే ఈమె పాత్రపై సహా మరిన్ని అంశాల్లో సినిమాలో లాజిక్స్ కూడా పెద్దగా ఉండవు. ఇలా వీటితో దిల్ రూబా చాలా బోరింగ్ గా సాగుతుంది. సినిమాలో నిర్మాణ విలువలు బాగానే ఉన్నాయి. కొన్ని అంశాల్లో ఇంకా బెటర్ గా చేయాల్సింది. మెయిన్ గా విఎఫ్ఎక్స్. టెక్నికల్ టీంలో సామ్ సి ఎస్ వర్క్ ఒకటీ రెండు పాటలు మినహా రెగ్యులర్ గా ఉంది. తన మార్క్ లో అనిపించలేదు. విశ్వాస్ డానియల్ సినిమాటోగ్రఫీ బాగుంది. ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ ఇంకా బెటర్ గా చేయాల్సింది. ఇక దర్శకుడు విశ్వ కరుణ్ విషయానికి వస్తే.. సారీ, థాంక్యూ అనే పదాలు వాటి విలువ ఎక్కడ వాడాలి అనే డీసెంట్ పాయింట్ పట్టుకున్నారు కానీ దానిని పట్టుకొని నడిపించిన విధానం మాత్రం మెప్పించాడు. ఎక్కడా కూడా సినిమాలో ఆడియెన్ ని ఎంగేజ్ చేసే రేంజ్ సీన్స్ కనిపించవు. చాలా డల్ ప్రొసీడింగ్స్ తో సాగుతుంది. ఇంకా కొంచెం ఎమోషనల్ డెప్త్ ని సినిమాలో జోడించి ఉంటే బాగుండేది ఏమో.. వీటితో అయితే తన వర్క్ ఈ చిత్రానికి పూర్తి స్థాయిలో మెప్పించాడు. ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ "దిల్ రూబా" లో కిరణ్ అబ్బవరం డీసెంట్ గా అలరిస్తాడు. అలాగే తనతో రుక్షర్ కూడా బానే చేసింది. కానీ సినిమాలో మెయిన్ పాయింట్ కి తగ్గ కథనం మాత్రం సాగలేదు. చాలా చాలా వరకు డల్ మూమెంట్స్ తో సాగే కథనం ఆడియెన్స్ కి కనెక్ట్ కాదు. ఇంకా బెటర్ ఎమోషన్స్ ని దర్శకుడు ప్లాన్ చేసి ఉంటే బాగుండేది. వీటితో మరీ లవ్/బ్రేకప్ సినిమాలు ఎలా ఉన్నా సరే ఇష్టపడేవారికి తప్ప మిగతా వారికి పెద్దగా కనెక్ట్ కాదు.